క్లుప్తంగా

నాగులాపల్లిలో స్వచ్ఛతా హీ సేవ



నాగులాపల్లిలో పరిశుభ్రత కార్యక్రమంలో అధికారులు

మునగపాక: ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని డీఎల్‌డీవో మంజులావాణి కోరారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల స్థాయి అధికారులు మండలంలోని నాగులాపల్లిలో పారిశుధ్యం మెరుగునకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శనివారం ఒక గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఈవోఆర్డీ సోమరాజు,పలువురు అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చురుగ్గా రక్షిత మంచి నీటి పథకం పనులు



గంగాదేవిపేటలో నిర్మిస్తున్న ట్యాంక్

మునగపాక: మండలంలోని గంగాదేవిపేటలో రక్షితమంచినీటి పథకం నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.45లక్షల వ్యయంతో 20వేల లీటర్ల కెపాసిటీ కలిగిన పథకాన్ని గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయి. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ఇంటింటికీ కొళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

'పల్లె పండగ'తో అభివృద్ధి

రాంబిల్లి (యలమంచిలి): పల్లె పండగ కార్యక్రమంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రాంబిల్లి మండలంలో వెల్చూరు,రాజకోడూరు గ్రామాల్లో ఎమ్మెల్యే శనివారం పర్యటించి, అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, సీసీ రోడ్లు నిర్మించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి మండలం అధికారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పల్లె పండగ

కోటవురట్ల: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని సీసీరోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కోటవురట్ల, కె.వెంకటాపురం, కొడవటిపూడి, చినబొడ్డేపల్లి, ఆక్సాహేబుపేట గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. చినబొడ్డేపల్లిలో సర్పంచ్ పైల శివరామ్ భూమిపూజ చేశారు. ఎంపీటీసీ యలమంచిలి ప్రకాష్, పీఆర్ జేఈ వర్మ, అధికారులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి



పిల్లల అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈవోలు

కోటవురట్ల: విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ సూచించారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌ను వారు శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలించి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ఆసక్తి పెరిగేలా బోధన ఉండాలన్నారు. హెచ్ఎం నాని మణిమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడ్డదారుల్లో భారీ వాహనాలు

- టోల్‌ఫీజు ఎగ్గొట్టేందుకేనంటూ విమర్శలు
- ఛిద్రమవుతున్న రోడ్లు
- భయాందోళనలు చెందుతున్న పలు గ్రామాల ప్రజలు



కాగిత,పాటిమీద రోడ్డులో బోల్తా పడిన రాళ్ల లోడు లారీ



భారీ వాహనాల వల్ల పాడైన రహదారి



టోల్‌ఫీజు నుంచి తప్పించుకునేందుకు కాగిత రోడ్డులో వెళ్తున్న భారీ వాహనం

నక్కపల్లి: జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగించాల్సిన భారీ వాహనాలు దొడ్డిదారిలో ప్రయాణిస్తున్నాయి. టోల్‌ఫీజునుంచి తప్పించుకోవడం కోసమే డ్రైవర్లు ఈ మార్గాలు ఎంచుకుంటున్నారు. దీంతో ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనని పలు గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. భారీ వాహనాల వల్ల రోడ్లు శిథిలమవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. టోల్ ఫీజు భారంనుంచి తప్పించుకునేందుకు మారుమూల గ్రామాలనుంచి రాకపోకలు సాగిస్తున్న ఒక భారీ వాహనం శనివారం కాగిత రోడ్డులో బోల్తాపడ్డాయి. కలకత్తా- చెన్నై 16వ నంబరు జాతీయరహదారి పై వేంపాడు వద్ద నేషనల్ హైవే అథారటీవారు టోల్‌ప్లాజా ఏర్పాటు చేశారు. విశాఖనుంచి విజయవాడవైపు రాకపోకలు సాగించే అన్ని వాహనాలు చోదకులు(ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు మినహా) ఇక్కడ టోల్ రుసుం చెల్లించాలి. ఎన్నిసార్లు ప్రయాణిస్తే అన్ని సార్లు ఫీజు చెల్లించాలి. కార్లకు ఒక పక్క రూ.130 చెల్లిస్తే సరిపోతుంది. అదే లారీలు, వ్యాన్‌లు, బస్సులు ఇతర భారీ వాహనాలు, కంటైనర్లు అయితే ఒక పక్క రూ.600నుంచి రూ.700 పైనే చెల్లించాలి. ఇలా వెళ్లే భారీ వాహనాల డ్రైవర్లు టోల్ ఫీజునుంచి తప్పించుకునేందుకు దొడ్డిదారి ఉపయోగిస్తున్నారు. విశాఖనుంచి రాజమండ్రివైపు వెళ్లే వాహనాలు కాగిత గ్రామంలోంచి పాటిమీద, తమ్మయ్యపేట, అమలాపురం మీదుగా వేంపాడు జాతీయరహదారిపైకి వెళ్లి అక్కడ నుంచి రాజమండ్రివెళ్తున్నారు. రాజమండ్రినుంచి విశాఖ వైపు వెళ్లే వాహనాలను వేంపాడు, అమలాపురం, పాటిమీద , కాగిత గ్రామాలమీదుగా జాతీయరహదారి చేరుకుని విశాఖ వైపు వైపు వెళ్తున్నాయి. టోల్ భారం తగ్గుతుందన్న ఆశతో డ్రైవర్లు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. అయితే దాదాపు 30నుంచి 60 టన్నుల బరువుతో రాకపోకలు సాగించే భారీ వాహనాలు గ్రామీణ రోడ్లపై రాకపోకలు సాగించడం వల్ల అవి శిథిలమవుతున్నాయని ఆయా గ్రామాల వారు ఆందోళన చెందుతున్నారు. తక్కువ సామర్థ్యంతో కేవలం గ్రామీణ ప్రాంతాల ప్రజల అవసరం కోసం ఏర్పాటు చేసిన రోడ్లపై భారీ వాహనాలు,కంటైనర్లు ప్రయాణించడం వల్ల రోడ్లపై గోతులు పడుతున్నాయని, ఎక్కడికక్కడ బీటలు వేస్తున్నాయని వారు తెలిపారు. చాలా రోజులనుంచి ఇదంతా జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. భారీ వాహనాలే కాకుండా మినీవ్యాన్‌లు, కార్లు కూడా ఇదే రూట్‌లో రాకపోకలు సాగిస్తున్నాయి. శనివారం గ్రానైట్ రాళ్లలోడుతో వెళ్తున్న భారీ లారీ ఒకటి కాగిత-పాటిమీద రోడ్డులో బోల్తాపడింది. ఇరుకుగా ఉన్న రోడ్డులో నుంచి వెళ్లడం అవతలవైపునుంచి వచ్చే వాహనాన్ని తప్పించేప్రయత్నంలో రోడ్డు మార్జిన్ చివర వరకు వెళ్లి బోల్తాపడింది. దీంతో కాగిత, పాటిమీద గ్రామాలకు రాకపోకలు సాగించేవారు చాలా ఇబ్బందులు పడ్డారు. వర్షాకాలం కావడం, ఇప్పటికే ఈ రోడ్డు అక్కడక్కడ పాడవడం, వీటికి తోడు భారీ వాహనాలు రాకపోకల వల్ల మరింత శిథిలమైందని గ్రామస్తులు తెలిపారు. నిత్యం ఈరోడ్లో 50నుంచి 60 వరకు భారీ వాహనాలు రాకపోలు సాగిస్తున్నాయని రాత్రిసమయాల్లో మరీ ఎక్కువగా ప్రయాణిస్తున్నాయని చెప్పారు. భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రమాదాలు జరుగుతాయనే భయాందోళనను వారు వ్యక్తం చేస్తున్నారు.శనివారం బోల్తాపడిన రాళ్ల లోడు లారీ గ్రామ కూడలిలో పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేశారు. ఇళ్లపై వాహనం పడి ఉండేదని వారు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భారీ వాహనాలతో భయాందోళనలు



టోల్‌ఫీజు కట్టాల్సి వస్తుందని చాలా వరకు భారీ వాహనాలు, కార్లు,జీపులు కాగిత మీదుగా ప్రయాణిస్తున్నాయి. ఈ వాహనాల రాకపోకల వల్ల గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. రోడ్లు పాడవుతున్నాయి. కాగిత మీదుగా పాటిమీద, మూలపర, తమ్మయ్యపేట, అమలాపురం, బోయపాడు, రాజయ్యపేట, చందనాడ తదితర గ్రామాలకు వెళ్లేందుకు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు రోడ్లు ఏర్పాటు చేశారు.భారీ వాహనాల వల్ల రోడ్లు పాడవుతున్నాయి. గోతులు ఏర్పడ్డాయి. వాటి వాహనాల రాకపోకలను అరికట్టాలి.

– పోతంశెట్టి బాబ్జి,కాగిత,

ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపొద్దు



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, ప్రజలు

రాంబిల్లి (యలమంచిలి) ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపవద్దని సీపీఎం రాంబిల్లి మండల కన్వీనర్ జి.దేముడునాయుడు కోరారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రాంబిల్లిలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడు నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సర్దుబాటు పేరుతో రూ.8,114 కోట్ల చార్జీలను పెంచేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విద్యుత్ భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచినప్పుడు బాదుడే బాదుడు అన్న తెలుగుదేశం నాయకులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరింత విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపాలని చూస్తున్నారని చెప్పారు. పేదలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని నమ్మించి, నేడు విద్యుత్ చార్జీలు పెంచడానికి సిద్ధమవుతోందంటే ఇంతకంటే మోసం మరొకటి ఉండదన్నారు.విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రామకృష్ణ, డి.కాశియ్య, వై.రాము, కె.లక్ష్మి, బి.శ్రీనివాస్, చోడిపిల్లి గంగరాజు,నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది రాజు మృతికి సంతాపం



డి.ఎస్.ఎన్. రాజు(ఫైల్)

యలమంచిలి రూరల్: పట్టణానికి చెందిన న్యాయవాది, వైఎస్సార్‌సీపీ నేత డి.ఎస్.ఎన్. రాజు శనివారం మృతి చెందారు.గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతి పట్ల యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్,వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, మున్సిపల్ వైస్ ఎంపీపీలు అర్రెపు గుప్తా,బెజవాడ నాగేశ్వరరావు,దూది నర్సింహమూర్తి,పిల్లా త్రినాథరావు, పట్టణానికి చెందిన పలువురు నాయకులు,కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు. రాజు గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి బాగా కృషి చేశారు. స్వగ్రామం పెదగుమ్ములూరు. ఆయన భార్య గతంలో మరణించారు.ఆయనకు కుమారుడు ఉన్నాడు. పెదగుమ్ములూరులో శనివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారిపై అన్నపూర్ణ డాబా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం శనివారం లభ్యమైంది. అందిన సమాచారం మేరకు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

20 నుంచి సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్ బృందంతో సమావేశమైన ఎంపీడీవో

కోటవురట్ల:ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ బృందం క్షేత్ర స్థాయి పరిశీలన ఈ నెల 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరుగుతుందని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సోషల్ ఆడిట్ బృందం , ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఏపీవో నాగరాజు మాట్లాడుతూ 1,467 పనులకు ఉపాధి వేతనదారులకు రూ.17.80 కోట్లు చెల్లించామని, మెటీరియల్ రూపంలో రూ.4.60 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, గ్రామసభల ద్వారా విచారణ చేస్తారని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు సహకరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం(మునగపాక): యలమంచిలి నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. అచ్యుతాపురంలోని ఏపీఐఐసీ భవనంలో శనివారం నియోజకవర్గ స్థాయి అధికారులతో అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం జంక్షన్‌ను సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు.ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి అధికారి సంబంధిత శాఖలపై నివేదిక అందించాలన్నారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో ఆవ

నష్టపోతున్న రైతులు
కన్నెత్తి చూడని అధికారులు



గోపాలపట్నం వద్ద ఉన్న ఆవ



ముంపునకు గురైన పంట పొలాలు (ఫైల్)

పాయకరావుపేట: మండలంలోని గోపాలపట్నం ఆవ ఆక్రమణలకు గురవుతోంది. నక్కపల్లి మండలంలోని ఉద్దండపురం నుంచి గోపాలపట్నం వరకు 720 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆవ విస్తరించి ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటితో పాటు తాండవ నది నుంచి సాగునీటి కాలువల ద్వారా వచ్చే నీరు, వర్షంనీరు ఆవలో నిల్వ ఉంటుంది. అవసరం మేరకు ఇక్కడ నుంచి సుమారు 2,500 ఎకరాల దిగువ ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తారు. సుమారు నాలుగు వందల మంది రైతులు ఈ ఆవపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. అధికంగా వర్షాలు కురిసే సమయంలో ఆక్రమణల కారణంగా వరద నీరు వెళ్లే మార్గం లేక ఆవను ఆనుకుని ఉన్న లోతట్టు ప్రాంతంలో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆక్రమణలను తొలగిస్తే నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు ఎక్కువ రోజులు అధికంగా నీరు నిల్వ ఉంటుందని, తమ పొలాలు ముంపునకు గురికావని రైతులు తెలి పారు. ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలనిఅన్నదాతలు కోరుతున్నారు.

80 ఎకరాలు అన్యాక్రాంతం ?

ఆవలో సుమారు 80 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్టు సమాచారం. దీంతో ఆవ గర్భం కుచించుకుపోయింది. కబ్జాచేసిన ప్రాంతాన్ని పొలాలుగా మార్చి యథేచ్ఛగా సాగు చేస్తున్నారు. అక్రమార్కులు ఇష్టానుసారం ఆక్రమిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలు తొలగించాలి



ఆవ చాలా వరకు ఆక్రమణలకు గురైంది. ఆవ గర్భం కుచించుకుపోవడతో పక్కనే ఉన్న పొలాలు మునిగిపోయి తీవ్ర నష్టం వస్తోంది. అధికారులు స్పందించి, ఆక్రమణలు తొలగించడంతో పాటు ఆవను వెడల్పు చేయాలి.

– తోట కిరణ్ , రైతు, గుంటపల్లి

రెవెన్యూ అధికారులు సర్వే చేయాలి

గతంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేపట్టినప్పుడు గట్టులు పెద్దగా వేశారు. దీని వల్ల ఆవ గర్భం కొంతవరకు కుచించుకుపోయింది. పూర్తి స్థాయిలో ఆక్రమణలపై దృష్టి సారించాలంటే వేసవి కాలంలో రెవెన్యూ అధికారులు సర్వే చేయాలి.

– శ్రీరామమూర్తి, ఏఈ, నీటిపారుదల శాఖ

గ్రామసభల ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: రీ-సర్వేలో లోపాలను సవరించేందుకు గ్రామసభలు దోహదపడతాయని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు.మునగపాక పంచాయతీలో శనివారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రీ-సర్వే నిర్వహించారని అక్కడక్కడా తప్పులు దొర్లాయన్నారు. అటువంటి తప్పులను సవరించడంతో పాటు తేడాలను సరిచేసేందుకు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఆది మహేశ్వరరావు తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ,ఉత్సవకమిటీ చైర్మన్ వేగి కృష్ణ,వీఆర్వో సురేష్, ఎంపీటీసీ సూరిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిని స్వచ్ఛతలో ముందుంచుదాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణాన్ని స్వచ్ఛతలో ముందంజలో నిలపడానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణ పరిధిలో టిడ్కో గృహ సముదాయం వద్ద శనివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.అక్కడ చెత్త,ముళ్ల తుప్పలు,ఇతర వ్యర్థాలను స్థానికులు,అధికారులతో కలిసి తొలగించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలన్నారు. పరిశుభ్రత పాటించడంలో పురపాలకసంఘానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్తా,బెజవాడ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బి.జె.ఎస్. ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి నియామకంపై హర్షం

నక్కపల్లి: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్‌కోఆర్డినేటర్‌గా పార్టీ ప్రధాన కార్యదర్శి,రాజ్యసభ సభ్యులు వి.విజయసాయి రెడ్డి నియామకం పట్ల రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. విజయసాయిరెడ్డి నేతృత్వంలో ఉత్తరాంధ్రలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. ఉత్తరాంధ్రలో పార్టీని సమర్థంగా నడిపించగల సత్తా ఉన్న నేత సాయిరెడ్డి అని తెలిపారు. ఉత్తరాంధ్రలో మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు ఇలా అందరితో సాయిరెడ్డికి సత్సంబంధాలు ఉన్నాయన్నారు. ఆయన నేతృత్వంలోనే 2019లో పార్టీ ఉత్తరాంధ్రలో ఎక్కువ స్థానాలను గెలుపొందిందని చెప్పారు. విజయసాయిరెడ్డికి బాధ్యతలు అప్పగించిన జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

పాల ధరను పునరుద్ధరించాలని ఆందోళన



మునగపాక బల్క్‌కూలర్ సెంటర్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మునగపాక: విశాఖ డెయిరీ ఇటీవల ఆవు పాల సేకరణ ధరను లీటరుకు రూ.4 చొప్పున తగ్గించడంతో రైతులు ఆందోళనకు దిగుతున్నారు. మునగపాక బల్క్‌కూలర్ సెంటర్ ఎదుట శనివారం రైతులతో కలిసి సీపీఎం నేతలు కర్రి అప్పారావు, బ్రహ్మాజీలు ఆందోళన చేశారు. ఆవు పాల ధరను తగ్గించడం వల్ల రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. తగ్గించిన పాలధరను డెయిరీ యాజమాన్యం వెంటనే పునరుద్ధరించాలని, రెండు సంవత్సరాల నుంచి నిలిపివేసిన బోనస్‌ను తక్షణం చెల్లించాలని, పశువులకు అందించే దాణా ధరను తగ్గించాలని, డెయిరీలో జరుగుతున్న దుబారాను తగ్గించి రైతులకు మేలు జరిగేలా చూడాలని కోరారు. ఆందోళనలో పలువురు రైతులు పాల్గొన్నారు. తగ్గించిన ఆవు పాల ధరను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మంగళవరపుపేట పాలకేంద్రం వద్ద , చూచుకొండ పాలకేంద్రం వద్ద రైతులు క్యాన్లతో నిరసన వ్యక్తం చేశారు.

రైతులకు న్యాయం జరిగేలా చూడాలని వినతి

అచ్యుతాపురం(మునగపాక): విశాఖడెయిరీ యాజమాన్యం రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ ఎండీకి శనివారం రైతుసంఘ నేతలు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు కర్రి అప్పారావు, ఎస్.బ్రహ్మాజీ, సూర్యనారాయణలు మాట్లాడుతూ పాల రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

వంటా వార్పుతో అభిజిత్ కార్మికుల నిరసన



వంటావార్పుతో నిరసన తెలుపుతున్న అభిజిత్ కంపెనీ కార్మికులు

అచ్యుతాపురం(మునగపాక):అచ్యుతాపురం ఎస్ఈజెడ్ పరిధిలోని అభిజిత్ కంపెనీ ఉద్యోగులు, కార్మికులు శనివారం కంపెనీ ఎదుట వంటావార్పుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, చిప్పాడ సర్పంచ్ రాజన్న మాట్లాడుతూ కార్మికులతో సంప్రదించకుండా అభిజిత్ కంపెనీ యాజమాన్యం లే-ఆఫ్ ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించి సంబంధిత కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు ఉపాధి కల్పించేలా చూడాలన్నారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

కోటవురట్లలో కుండపోత



కోటవురట్లలో కురుస్తున్న వర్షం

కోటవురట్ల: మండలంలో శనివారం కుండపోతగా వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి వర్షం నీరు చేరింది. ఈ వర్షం వరి చేలకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు. తెగుళ్లు ఆశించకుండా వర్షం దోహదపడుతుందని చెబుతున్నారు. వర్షంతో పాటు పడిన పిడుగుల శబ్దాలు స్థానికులను భయభ్రాంతుకు గురిచేశాయి.

ఎన్ఎమ్ఎమ్ఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ



8వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న వింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు,టీచర్లు

యలమంచిలి రూరల్: ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ చేయూతనందిస్తోంది. యలమంచిలి పట్టణంలో జెడ్పీ బాలికోన్నత, కొత్తపేట జెడ్పీ హైస్కూల్,రేగుపాలెం ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు శనివారం సంస్థ ప్రతినిధులు ఎన్ఎమ్ఎమ్ఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులంతా ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని వింగ్స్ ఫౌండేషన్ కార్యదర్శి ఎం.జయప్రకాష్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రశాంతి,పి రజని పాల్గొన్నారు.